స్పీకర్‌కు మాఫీ.. మాకెందుకు కాదు?

- రుణమాఫీకాని రైతుల ఆందోళన
- మైలార్‌దేవ్‌పల్లిలో 30శాతం మందికే మాఫీ
- రేషన్‌కార్డు లేదని చాలామందికి నష్టం
- పట్టాపాస్ బుక్ చూసే రుణమిచ్చారని రైతుల ఆగ్రహం



రుణమాఫీ కాలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్న మైలార్‌దేవ్‌పల్లి రైతులు (ఫైల్)

వికారాబాద్, ఆగస్టు 21, (నమస్తే తెలంగాణ): జిల్లాలో రుణమాఫీకాని రైతులు ఆందోళన బాట పట్టారు. జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు రుణమాఫీ అయి అర్హులైన పేద రైతులకు రుణమాఫీ కాక పోవడంతో కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. చిన్న చిన్న ప్రభుత్వ ఉద్యోగులను రుణమాఫీ జాబితా నుంచి తొలగించిన ప్రభుత్వం.. స్పీకర్ హోదాలో ఉన్న ప్రసాద్‌కుమార్ రుణాలను ఏ విధంగా మాఫీ చేశారని నిలదీస్తున్నారు. స్పీకర్ ప్రాతినిధ్యం వహిస్తున్న వికారాబాద్ నియోజకవర్గం లోని మైలార్‌దేవ్‌పల్లి గ్రామాన్ని నమస్తే తెలంగాణ సందర్శించగా రుణమాఫీ కాని రైతులు తమ గోడును వెల్లబోసుకున్నారు. మైలార్‌దేవ్‌పల్లిలో రూ.2లక్షల లోపు రుణాలు తీసుకున్న రైతులు సుమారు 600 మంది ఉండగా, వీరిలో కేవలం 180 మందికే రుణాలు మాఫీ అయ్యాయి. రైతుల్లో ఎక్కువమంది రేషన్‌కార్డు లేకపోవడంతోనే నష్టపోయారు. బ్యాంకులు రేషన్‌కార్డు చూసి రుణం ఇచ్చిందా? పట్టాదారు పాసు పుస్తకాన్ని చూసి రుణాలను మంజూరు చేసిందా? అంటూ ప్రభుత్వాన్ని మైలార్‌దేవ్‌పల్లి రైతులు ప్రశ్నిస్తున్నారు.

స్పీకర్‌కు మాఫీ పొరపాటే

- రుణమాఫీ డబ్బులు వాపస్
- వికారాబాద్ జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్

రాష్ట్ర శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ బ్యాంకు ఖాతా నంబర్‌కు రైతు రుణమాఫీ పథకం కింద రూ. 1,50,863 పొరపాటున జమ చేయబడినవని వికారాబాద్ జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాండూరు డీసీసీబీలో టెక్నికల్ సమస్య వలన ఈ అమౌంట్ గడ్డం ప్రసాద్ కుమార్ బ్యాంకు ఖాతాలోకి జమ అయ్యాయని పేర్కొన్నారు. ఈ విషయంపై స్పీకర్ ప్రసాద్‌కుమార్ స్పందిస్తూ తన బ్యాంకు అకౌంట్‌కు పొరపాటున వచ్చిన రూపాయలను తిరిగి అదే బ్యాంక్ ద్వారా ప్రభుత్వానికి వాపసు చేస్తున్నట్టు తెలిపారు.

ఇది చెల్లని ప్రభుత్వం

నేను వికారాబాద్‌లోని తెలంగాణ గొల్కొండ గ్రామీణ బ్యాంకులో రూ.1.80లక్షలు, మా భార్య పేరిట రూ.1.20 లక్షల రుణం తీసుకున్నాం. మూడువిడతల్లో మా ఇద్దరిలో ఏ ఒక్కరికీ రుణమాఫీ కాలేదు. దీనిపై ప్రశ్నిస్తే బ్యాంకు సిబ్బంది, వ్యవసాయాధికారులు ఒకరి పైఒకరు చెప్పుకుంటున్నారు. ఇది చెల్లని ప్రభుత్వం.

- సామ కరుణాకర్ రెడ్డి, మైలార్‌దేవ్‌పల్లి

బ్యాంకర్ల నిర్లక్ష్యం రైతులకు నష్టం

నేను రూ.1.60 లక్షల రుణం తీసుకున్నాను. ప్రతీ ఏటా రెన్యూవల్ చేస్తున్నాను. మూడో విడతలో మాఫీ అవుతుందని వ్యవసాయాధికారులు చెప్పారు కానీ ఇప్పటివరకు మాఫీ కాలేదు. బ్యాంకు అధికారులను అడిగితే రెన్యూవల్ చేసుకోలేదని నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారు. బ్యాంకు అధికారులు చేసిన తప్పుకు రైతులకు నష్టం చేయడం ప్రభుత్వానికి తగదు.

- ఎస్.మాణిక్ రెడ్డి, మైలార్‌దేవ్‌పల్లి

మిత్తి కట్టినా మాఫీ కాలేదు

నేను రూ.2 లక్షల రుణం తీసుకున్నాను. ప్రతీ ఏటా రెన్యూవల్ చేస్తున్నాను. మిత్తి డబ్బులను చెల్లిస్తే రూ.2 లక్షలలోపు రుణమాఫీ అవుతుందని వ్యవసాయాధికారులు తెలిపారు. మిత్తి డబ్బులను పదిహేను రోజుల క్రితమే చెల్లించాను. ఇప్పటికీ నా రుణం మాఫీ కాలేదు.

- ఆలంపల్లి మల్‌రెడ్డి, మైలార్‌దేవ్‌పల్లి వికారాబాద్ జిల్లా

దేవుళ్ల మీద ఒట్టు.. కొడంగల్‌లో మాఫీ కనికట్టు

సీఎం రేవంత్ సొంత నియోజకవర్గంలో 35.54 శాతమే రుణమాఫీ

- 33,898 మంది రైతులు రుణమాఫీకి దూరం
- అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న రైతులు

రుణమాఫీ కాలేదని కొడంగల్ వ్యవసాయ ఏడీ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తున్న రైతులు

వికారాబాద్, ఆగస్టు 21, (నమస్తే తెలంగాణ): 'జోగులాంబ నుంచి మొదలుకుని ఏడుపాయల దాకా' కనిపించిన దేవుళ్లమీద ఒట్టేసి చెప్పండు సీఎం రేవంత్‌రెడ్డి.. పంద్రాగస్టుకల్లా రైతులందరికీ రుణమాఫీ చేస్తానని. మూడు విడతల్లో మాఫీ జాబితాలు విడుదల చేసినా.. రాష్ట్రంలో రైతులందరికీ సంపూర్ణంగా రుణమాఫీ కాలేదు. కనీసం సీఎం రేవంత్‌రెడ్డికి ఓటేసి గెలిపించిన కొడంగల్ నియోజకవర్గ రైతులకైనా సంపూర్ణ రుణ మాఫీ జరిగిందా ? అంటే అదీ లేదని రైతులు సమాధానమిస్తున్నారు. సీఎం సొంతనియోజకవర్గమైన కొడంగల్‌లో 35.54శాతం రైతులకు మాత్రమే రుణమాఫీ అయింది. రేవంత్ రెడ్డికి ఓటేసిన పాపానికి వృద్ధులు మొదలుకొని మహిళలు, పిల్లలు సహా వ్యవసాయ కార్యాలయాలు, బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నామని కొడంగల్ రైతులు వాపోతున్నారు. కొడంగల్ గడ్డపై ప్రేమంటే ముందు ఇక్కడి రైతుల రుణం తీర్చుకోవాలని కోరుతున్నారు. వికారాబాద్ జిల్లా పరిధిలోకి వచ్చే కొడంగల్ నియోజకవర్గంలోని కొడంగల్, బొంరాసుపేట్, దౌల్తాబాద్, దుద్యాల మండలాల్లో ఆయా బ్యాంకుల్లో పంట రుణాలు తీసుకున్న రైతులు 52,305 మంది ఉన్నారు. వీరిలో 18,407 మంది మాత్రమే రుణమాఫీ పూర్తయ్యింది. మిగతా 33,898 మంది రైతులు రుణమాఫీకి దూరమయ్యారు. జిల్లావ్యాప్తంగా రుణమాఫీ గ్రీవెన్స్‌కు సుమారు 5 వేల దరఖాస్తులు అందినట్టు వ్యవసాయాధికారులు వెల్లడించారు.

మాఫీ అంతా మాయ

సీఎం రేవంత్‌రెడ్డి పక్రటించిన రైతు రుణమాఫీ అంతా మాయగా ఉంది. ఎవరికి మాఫీ అయ్యిందో తెలియడం లేదు. రూ.2లక్షల రుణ మాఫీ అన్నారు.. కానీ లక్షలోపు కూడా లబ్ధి కాలేదు. మా రుద్రారం రైతులు కొడంగల్ వ్యవసాయ కార్యాలయానికి పరుగులు పెట్టాల్సి వస్తున్నది. ఏఈవోల బదిలీతో మాఫీ ఎందుకు కాలేదో తెలుసుకోవడం కష్టంగా మారింది. కాంగ్రెస్ ప్రభుత్వం సగం మందికి కూడా రుణమాఫీ చేయలేదు.

- రాఘవేందర్‌రెడ్డి, రుద్రారం, కొడంగల్

తెల్వదంటే ఎవరిని అడగాలి ?

నా పేరు మీద రూ.25వేలు, నా భార్య మల్లమ్మ పేరు మీద 65,500లు మొత్తంగా 90,500ల అప్పు ఉంది. మా ఇద్దరిలో ఏ ఒక్కరికీ రుణమాఫీ జరగలే. బ్యాంకుకు పోయి అడిగితే లిస్టులో పేరు లేదు.. మాకు తెల్వదంటున్నారు. మరి ఎవరిని అడగాలి.. ఎక్కడికెళ్లి కలవాలి.. అర్హత ఉన్నప్పటికీ మాఫీ కాలేదు.

- ఎరుకలి పెద్ద ఆశన్న, హస్నాబాద్, కొడంగల్

మాఫీ మాటల్లోనే.. చేతల్లో కాదు

నేను కొడంగల్ ఎస్‌బీఐలో రూ.1.40 లక్షలు, నా కొడుకు దయాకర్ రూ.90 వేలు పంట రుణం తీసుకున్నాం. రేషన్‌కార్డును ప్రాతిపదికగా తీసుకున్నా ఇద్దరిలో ఒకరికైనా మాఫీ కావాలి. ఇద్దరికీ కాలేదు. ఇదేం రుణమాఫీయో అర్థం కావడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన రుణమాఫీ మాటల్లోనే ఉంది. చేతల్లో లేదు.

-గోవిందర్‌రెడ్డి, రేగడిమైలారం, బొంరాస్‌పేట మండలం

మాఫీ కోసం తిరుగుతున్నా

బొంరాస్‌పేట ఎస్‌బీఐలో రెండేండ్ల కింద రూ.1.80 లక్షల పంట రుణం తీసుకున్నా. ప్రభుత్వం చెప్పిన కటాఫ్ తేదీ ప్రకారం నాకు రుణమాఫీ కావాలి. కానీ జాబితాలో నా పేరు లేదు. ఎందుకు కాలేదో అడుగుదామని అధికారుల వద్దకు తిరుగుతున్నా.

-గోరుపల్లి క్రిష్ణయ్య, మదన్‌పల్లి, బొంరాస్‌పేట మండలం

మసిపూసి మారేడులా రుణమాఫీ

రైతులను కాంగ్రెస్ మోసం చేసింది • బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 21 (నమస్తే తెలంగాణ) : పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. హైదరాబాద్‌లో బుధవారం జరిగిన ఓ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రుణమాఫీ తీరు మసిపూసి మారేడు కాయ చేసిన చందంగా ఉన్నదని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. 400కు పైగా హామీలు, 6 గ్యారంటీల పేరుతో ప్రజలను కాంగ్రెస్ మభ్యపెట్టిందని, ఏ ఒక్క హామీనీ చిత్తశుద్ధితో అమలు చేయడం లేదని, ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు, ఆరోగ్యశ్రీ బకాయిలు చెల్లించలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో బీజేపీ అభ్యర్థులు పోటీ చేస్తారని ప్రకటించారు. గ్రామ, మండల, జిల్లాస్థాయి కమిటీలు వేసి ప్రజాసమస్యలపై పోరాటం చేస్తామని చెప్పారు.

కోమటిరెడ్డి సొంతూర్లో కొందరికే మాఫీ

- బ్రాహ్మణవెల్లంలలో 47 శాతం మందికే రుణమాఫీ
- 925 మంది రుణాలు తీసుకుంటే 433మందికే రుణవిముక్తి
- 110 మందికి రేషన్ కార్డు లేక..50 మందికి వివరాలు లేక..
- 332 మంది వివరాలు గల్లంతు
- బ్యాంకుల చుట్టూ రైతుల చక్కర్లు

కోమటిరెడ్డి స్వగ్రామం బ్రాహ్మణవెల్లెంలలో రుణమాఫీకాని రైతులు

నల్లగొండ ప్రతినిధి, ఆగస్టు 21 (నమస్తే తెలంగాణ): కోమటిరెడ్డి బ్రదర్స్‌లో ఒకరు రాష్ట్ర మంత్రి.. మరొకరు మునుగోడు ఎమ్మెల్యే. వీళ్ల సొంతూరు నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని బ్రాహ్మణవెల్లంల. రాష్ట్ర ప్రభుత్వంలో కీలకంగా ఉన్న ఈ ఇద్దరు సోదరుల సొంతూరులో రైతు రుణమాఫీ సగం మందికి కూడా కాలేదు. రుణమాఫీ చారిత్రాత్మకమని చెబుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్వగ్రామాన్ని 'నమస్తే తెలంగాణ' బృందం సందర్శించింది.

బ్రాహ్మణవెల్లంలలో మొత్తం 1,089 రైతు కుటుంబాలు ఉన్నాయి. ఈ గ్రామ రైతులు నార్కట్‌పల్లి, చిట్యాల మండలాల పరిధిలోని ఎస్‌బీఐ(2), కెనరా(4), యూనియన్, ఇండియన్ బ్యాంకు, సహకార బ్యాంకులకు సంబంధించిన మొత్తం 9 బ్రాంచీలపై ఆధారపడతారు. వాటి పరిధిలో మొత్తం 925 మంది రైతులు పంట రుణాలు పొందినట్టు వ్యవసాయ అధికారుల అంచనా. వారిలో కేవలం 433 మందికే రుణమాఫీ లబ్ధి చేకూరినట్టు తెలిసింది. తొలివిడతలో 156 మందికి, రెండో విడతలో 88మందికి, మూడో విడతలో 189 రైతులకు మాఫీ వర్తించింది. 110 మందికి రేషన్ కార్డు లేదని, 50 మంది వివరాలు లేవని మాఫీ కాకపోగా, మిగిలిన 332 మందికి రుణ మాఫీ వస్తుందా? రాదా? కారణాలేంటనేది ప్రశ్నార్థకంగా మారింది. వీరంతా నిత్యం బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. బ్యాంకుల వద్ద వ్యవసాయ అధికారులను అడగమని తిప్పి పంపుతున్నట్టు చెప్పారు. వ్యవసాయ అధికారులు మాత్రం రుణమాఫీ డేటాతో మాకు సంబంధంలేదని స్పష్టం చేస్తున్నారు. డేటా బ్యాంకుల వద్ద నుంచి ప్రభుత్వానికి వెళ్లింది కాబట్టి వాళ్లే సమాధానం చెప్పాలని దాటవేస్తున్నారు. బ్యాంకర్ల ఈసడింపులు, వ్యవసాయ అధికారుల నిస్సహాయత నడుమ చెప్పులు అరిగేలా తిరుగుతున్నామని బ్రాహ్మణవెల్లంల రైతులు చెప్తున్నారు.

ఖాతాకు పనికొచ్చిన ఆధార్.. మాఫీకి పనిచేయదా ?

మూడేండ్ల కింద నార్కట్‌పల్లి బ్యాంకులో 50వేలు లోన్ తీసుకున్న. ప్రభుత్వం మూడు సార్లు మాఫీ చేసినా లిస్టులో నా పేరు రాలేదు. ఎందుకు రాలేదో ఎవరూ చెప్పడం లేదు. బ్యాంకు వాళ్లని అడిగితే నీ ఆధార్‌కార్డు లింక్ కాలేదు అంటున్నరు. నేను ఆధార్ కార్డు పెట్టే ఖాతా తీసుకున్నా. ఖాతాకు పనికొచ్చిన ఆధార్.. మాఫీకి లేదంటే ఎట్లనో చెప్పేటోళ్లే లేరు.

- మైల పిచ్చయ్య, రైతు, బ్రాహ్మణవెల్లంల

పేరుకే పెద్దూరు..

నేను ఇండియన్ బ్యాంకులో లక్షా 30వేల క్రాప్ లోన్ తీసుకున్న. రుణమాఫీపై గంపెడాశ ఉండె. ప్రతియేటా వడ్డీకట్టినా నా లోన్ మాఫీ కాలేదు. 20 రోజుల నుంచి బ్యాంకులు, అధికారుల చుట్టూ తిరుగుతున్న. వీళ్లనడిగితే వాళ్లనడుగు.. వాళ్లనడిగితే వీళ్లడుగు అంటున్నరు. పేరుకు మాత్రం పెద్దూరు. న్యాయం మాత్రం జరుగుతలేదు.

- మైల రామలింగయ్య, కొత్తగూడెం, బ్రహ్మణవెల్లంల

చెప్పులరిగేలా తిరుగుతున్నా

నేను బ్యాంకులో రూ.40వేలు లోన్ తీసుకున్నా. ప్రతి సంవత్సరం వడ్డీ కడుతున్న. తొలి విడుతలోనే రుణమాఫీ కావాలి. ఇప్పటివరకు కాలేదు. ఎందుకని అడిగితే చెప్పేటోళ్లే లేరు. ఆధార్ కార్డు అడిగితే ఇచ్చిన. రేషన్ కార్డు కూడా ఉంది. కానీ ఎందుకు కాలేదో తెలుస్తలేదు. చెప్పులరిగేలా తిరుగుతున్నా. దండం పెడుతున్న సారూ..న్యాయం చేసి ఆదుకోండి.

-కాసం అయిలయ్య, రైతు, బ్రాహ్మణవెల్లంల

మా ఇంట్లో ఎవరికీ కాలేదు

నా పేరు మీద లక్షా 5 వేలు, మా ఆయన పేరున 98వేలు.. మొత్తం 2 లక్షల 3 వేల రూపాయలు క్రాప్ లోన్ ఉంది. మా ఇద్దరిలో ఎవరికీ రుణమాఫీ కాలేదు. బ్యాంకు అధికారులు పైనున్న మూడు వేలు కట్టండి ఫస్ట్ అంటున్నరు. కడితే ఇస్తారా అంటే దానికి గ్యారంటీ ఇస్తలేరు. ఈ సర్కార్‌లో అంతా అయోమయంగా ఉంది.

- పల్లె కవిత, బ్రాహ్మణ వెల్లెంల

సీఎంనే అడుక్కోపో అన్నరు

నార్కట్‌పల్లి కో అపరేటివ్ బ్యాంకులో అరవై వేలు క్రాప్ లోన్ తీసుకున్న. నాకు ఫస్టే మాఫీ కావాల్సి ఉండే.. కానీ రాలేదు. అప్పటి నుంచి బ్యాంకులు, వ్యవసాయ ఆఫీసర్ల చుట్టూ తిరుగుతున్న. ఆన్‌లైన్‌లో పేరెందుకు లేదని అడిగితే.. సీఎం రేవంత్‌రెడ్డినే అడుక్కోపో అంటున్నరు. మా ఊరి మాజీ సర్పంచ్ చేత కూడా చెప్పించిన. పట్టించుకున్నోళ్లు లేరు. ఇది దండుగ ప్రభుత్వం.

-కాసం మల్లయ్య, రైతు, బ్రాహ్మణవెల్లంల

రుణమాఫీపై బీఆర్ఎస్ రణం

119 నియోజవకర్గాల్లో నేడు ధర్నాలు

హైదరాబాద్, ఆగస్టు 21 (నమస్తే తెలంగాణ): రైతు రుణమాఫీ కోసం బీఆర్ఎస్ రణం షురూ చేసింది. సర్కార్ మెడలు వంచి ఎటువంటి ఆంక్షల్లేకుండా రైతులందరికీ రూ. 2 లక్షల రుణమాఫీ చేయాలనే డిమాండ్‌తో బీఆర్ఎస్ పార్టీ గురువారం రాష్ట్రవ్యాప్తంగా 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ధర్నా చేపట్టనున్నది. రాష్ట్ర రైతాంగానికి బాసటగా నిలిచేందుకు బీఆర్ఎస్ కార్యాచరణ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ మేరకు పార్టీ శ్రేణులను బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశాలతో వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కార్యాచరణను రూపొందించారు. పార్టీని వీడిన ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాలు, కాంగ్రెస్ సర్కార్‌లో మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల కేడర్‌ను సమాయత్తపరిచి కార్యక్రమ విజయానికి కావలసిన ఏర్పాట్లు చేసింది. ఏ నియోజకవర్గాల్లో ఎవరి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నారో కేటీఆర్ బుధవారం పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ముఖ్యమంత్రి రూ. 2 లక్షల వరకు అందరికీ రుణమాఫీ అయ్యిందని చెబుతుంటే మంత్రులు మాత్రం ఇంకా రుణమాఫీ పూర్తికాలేదని చెబుతున్న వైనాన్ని రైతాంగానికి తెలిపేలా కార్యాచరణను పార్టీ సిద్ధం చేసింది. ఎన్నికలు కాగానే రుణమాఫీకి రూ.40 వేల కోట్ల అవసరమని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొని, మంత్రివర్గ సమావేశం రూ.31 వేల కోట్లకే అనుమతిచ్చారు. రుణమాఫీకి బడ్జెట్లో రూ.26వేల కోట్లకు ఆమోదం తెలిపి, కేవలం రూ.18వేల కోట్లు ఖర్చు చేసి రైతులను నిలువునా ముంచారని ప్రతీ రైతుకు తెలిసేలా ధర్నాలో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని కేటీఆర్ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. క్షేత్రస్థాయిలో కనీసం 40శాతం మంది రైతులకు కూడా రుణమాఫీ లబ్ధిచేకూరలేదని సమాచారం ఉన్న నేపథ్యంలో బీఆర్ఎస్ ధర్నా పిలుపునకు రైతాంగం నుంచి విశేష స్పందన వస్తున్నది. అడ్డగోలు ఆంక్షలతో రైతులకు టోపీ పెట్టిన ప్రభుత్వ వైఖరిపై రైతులోకం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నది. ఈ నేపథ్యంలో నేడు గులాబీ దళం చేపట్టనున్న నిరసనలో పాల్గొనేందుకు రైతులు స్వచ్ఛందంగా తరలివస్తారని భావిస్తున్నారు.

ఉత్తమ్ ఊర్లో ఉత్తమాటే!

- మంత్రి సొంత గ్రామంలో 45శాతమే రుణమాఫీ
- మంత్రిపై బుసలుకొడుతున్న తాటిపాముల రైతులు
- 992 రైతులకుగాను 537 మందికే మాఫీ

మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి సొంత ఊరు సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలంలోని తాటిపాముల గ్రామ పంచాయతీ

సూర్యాపేట, ఆగస్టు 21 (నమస్తే తెలంగాణ): 'నీకు రుణమాఫీ అయిందా? అంటే నీకు అయిందా? అనేదే ఇప్పుడు పల్లెల్లో ఏ నలుగురు కలిసినా వినిపిస్తున్న ముచ్చట. చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో కాంగ్రెస్ రుణమాఫీ చేసిందని గొప్పలు చెబుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సొంతూరు సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలం తాటిపాముల గ్రామాన్ని నమస్తే తెలంగాణ సందర్శించింది. మంత్రి స్వగ్రామంలో 45శాతానికి మించి రుణమాఫీ కాకపోవడం గమనార్హం. ఈ గ్రామంలో 992 మంది రైతులకుగాను మూడు విడతల్లో కలిపి కేవలం 537మందికే రుణమాఫీ అయినట్టు తెలుస్తున్నది. తొలి విడతలో 357 మందికి, రెండో విడతలో 165 మందికి రుణమాఫీ అయ్యింది. మూడో విడతలో జాబితా ప్రకారం 15 మందికి మించి కాలేదని తెలుస్తున్నది. గ్రామంలో ఎవరినీ మందలించినా ఎక్కడిదయ్యా రుణమాఫీ అంటున్నారు. 'మాకు రాలేదు.. మాకు రాలేదు' అనే వారే ఎక్కువగా ఉన్నారు. గ్రామస్తుల మాట ప్రకారం ఉత్తమ్ ఊర్లో మాఫీ ఉత్తదేనని తేలింది. ప్రభుత్వం దిగి వచ్చి ఇచ్చిన హామీ ప్రకారం రుణాలు మాఫీ చేయాలని, లేని పక్షంలో రైతుల ఆగ్రహం చవి చూడాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు.

గివేం కొర్రీలు ..

ఎన్నికలప్పుడు పాస్ పుస్తకం ఉన్నోళ్లంతా బ్యాంకులకు వెళ్లి రుణం తీసుకోండి.. అధికారంలోకి రాగానే రెండు లక్షల లోపు రుణాలు మాఫీ చేస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీ ఇవ్వకముందే మేము రుణాలు తీసుకున్నాం. ఇయ్యాల రేషన్‌కార్డుకే రెండు లక్షలట. మా కుటుంబం అందరి పేర్లు ఒకే రేషన్ కార్డులో ఉన్నాయి. కాబట్టి మీకు రుణమాఫీకాదని అధికారులు అంటున్నారు. గివేం కొర్రీలు.. ఇదెక్కడి న్యాయం.

- కారుపోతుల అంజయ్య, తాటిపాముల, తిరుమలగిరి మండలం

రుణమాఫీ గందరగోళం

నేను 30 వేలు పంట రుణం తీసుకున్నా. అయినా రుణ మాఫీ కాలేదు. ఇదెక్కడి న్యాయమో అర్థం కావడం లేదు. ఏమి అడిగినా లిస్టులో మీ పేరు లేదు.. మాకు తెలియదని అధికారులు అంటున్నరు. కావాలంటే దరఖాస్తు ఇవ్వండి చెబుతున్నారు. రుణమాఫీ అంతా గందరగోళం.

- కారుపోతుల శ్రీకాంత్, తాటిపాముల, తిరుమలగిరి మండలం

ఇంత మోసమా..?

నేను, నా భర్తకు వేర్వేరుగా పాస్ బుక్కులు ఉన్నాయి. నేను లక్షా 36వేలు, నా భర్త నక్కల యాదగిరి లక్షా 20 వేలు తీసుకున్నాం. ఇద్దరి పేర్లు ఒకే రేషన్ కార్డులో ఉన్నాయని మాకు రుణ మాఫీ కాలేదని అధికారులు చెబుతున్నరు. భార్యభర్తలకు రెండు రేషన్ కార్డులు ఉంటాయా..? ఇంత మోసమా..? రుణం ఇచ్చేటప్పుడు ఏ కండిషన్లు పెట్టకుండా రుణ మాఫీ చేసేటప్పుడు ఈ కండిషన్లు ఏంటిదో.

- నక్కల సైదమ్మ, తాటిపాముల, తిరుమలగిరి మండలం

ఇదేం రుణమాఫీ.. ఇదేం ప్రభుత్వం

నేను లక్ష 60వేల పంట రుణం తీసుకున్నా. మూడో విడుతలోనైనా రుణమాఫీ జరుగుతుందని ఆశించాను. నాకు రేషన్ కార్డు లేదని జాబితాలో పేరు రాలేదు. ఇదేం ప్రభుత్వం. ఇదేం రుణమాఫీ. బ్యాంకుల్లో అప్పులు తీసుకునేందుకు ఉన్న నిబంధనలు మాఫీ చేసేందుకు వర్తించవా ?

- దయా యాదవ్, తాటిపాముల, తిరుమలగిరి మండలం

గులాబీ నేతలకు పోలీసు నోటీసులు

నేటి బీఆర్ఎస్ ఆందోళనలను సర్కార్ అడ్డుకునే యత్నం

బాల్కొండ, ఆగస్టు 21: రుణమాఫీ పేరిట రైతులను అరిగోస పెడుతున్న రేవంత్ సర్కారుకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ గురువారం తలపెట్టిన ఆందోళన కార్యక్రమాలను అడ్డుకునే ప్రయత్నాలకు ప్రభుత్వం తెరలేపింది. ధర్నాలకు వెళ్లొద్దని పోలీసుల ద్వారా నోటీసులు జారీ చేయిస్తున్నది. ఆందోళన కార్యక్రమాలకు ప్రభుత్వ అనుమతి లేదని, ఒకవేళ ఆ కార్యక్రమానికి వెళ్తే చట్టబద్ధంగా చర్యలు తీసుకుంటామని పోలీసులు నోటీసులు జారీ చేయడం జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. అన్నదాతలకు అండగా చేపట్టే ఈ కార్యక్రమానికి రావొద్దని పోలీసులు ఆదేశించడంపై రైతులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.